తాగునీటి సమస్య పరిష్కరించండి


ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు


జలమండలి అధికారులకు ఫిర్యాదు చేస్తున్న రావులకోళ్ల నాగరాజ్ తదితరులు

బండ్లగూడ: హైదర్షాకోట్ శాంతినగర్ కాలనీ రోడ్ నెంబర్–3 వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీలో తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని, కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ..గృహ అవసరాల నీటి కోసం బోర్ల ద్వారా మాత్రమే ఆధారపడి ఉన్నామన్నారు. వేసవి కాలం మొదలవడంతో బోర్లు ఎండిపోతున్నాయన్నారు. జలమండలి అధికారులు నాలుగు రోజులకు ఒకసారి అది కూడా కేవలం ఒక గంట మాత్రమే నీటిని వదులుతున్నారన్నారు. రోజు విడిచి రోజు నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరామన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కె.నాగేష్, ప్రధాన కార్యదర్శి ఏ.వినయ్ కుమార్‌గౌడ్, కోశాధికారి పి.కోటేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు అమర్‌సింగ్, మనోహర్ పాల్గొన్నారు.

వేసవి రాకముందే నీటి కష్టాలు ప్రారంభం..

వేసవి రాకముందే నీటి కష్టాలు ప్రారంభమైయ్యాయని ఈ సమస్యను పరిష్కరించేందుకు జలమండలి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజ్ కోరారు. నీటి కటకటపై జలమండలి అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాటల్లాడుతూ..బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మాధవీనగర్ కాలనీ, పీజీ కాలనీ ఇతర కాలనీల వాసులకు నీటి సమస్య తీవ్రంగా ఉండడంతో నీటి దాహార్తిని తీర్చాలని నీటి ఎద్దడి తలెత్తకుండా పరిష్కారం చూపాలన్నారు. హిమాయత్‌సాగర్ నుంచి వాటర్ వస్తాయని ఈ మధ్యనే వాటర్ గ్రిడ్ ప్రారంభోత్సవం చేశారన్నారు. మరి ఎందుకు వాటర్ రావడం లేదన్నారు. గతంలో కేసీఆర్ సర్కార్ మిషన్ భగీరథతో తాగునీటి కష్టాలు తీర్చిందని మండు వేసవిలోనూ నీటి కష్టాలు లేకుండా తాగునీటి కష్టాలు తీర్చిందని గుర్తు చేశారు. మార్చి, ఏప్రిల్, మే నెలలో తమ పరిస్థితి ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి వాటర్ సమస్య లేకుండా రోజు విడిచి రోజు నీళ్లు సక్రమంగా విడుదల చేయాలని అధికారులను కోరారు.

నూతన రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

యాకుత్‌పురా: నూతన రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని కార్డు లేని వారు స్థానిక మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ యాకుత్‌పురా సర్కిల్–02 ఏసీఎస్ఓ మోకా సురేందర్ సూచించారు. పురానీహవేలిలోని సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే సర్వే పూర్తయిన రేషన్ కార్డుల జాబితాను ప్రభుత్వం త్వరలో నిర్వహించే వార్డు సభల కార్యక్రమంలో ఆమోదిస్తారన్నారు. నూతన రేషన్ కార్డులు పొందేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో మీ సేవా కేంద్రాల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, మ్యారేజ్ సర్టిఫికెట్ లేదా వివాహ పత్రిక, చిరునామాకు సంబంధించిన జిరాక్స్ కాపీలతో మీ సేవాలో రూ.45 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వీర జవాన్లకు నివాళి



గౌలిపురా: పుల్వామా ఘటనలో అమరులైన వీర జవాన్లకు శుక్రవారం లాల్ దర్వాజా మోడ్‌లో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు మాట్లాడుతూ..పుల్వామా దాడిలో అమరులైన వీర జవాన్లను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్య నగర్ జిల్లా బజరంగ్ దళ్ కన్వీనర్ కే.పవన్ కుమార్, కో కన్వీనర్ శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకాఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం


పూజల్లో మధిర సత్యనారాయణ తదితరులు

జియాగూడ: ఇమాంపురాలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇమాంపురా నవ భారత్ సంఘం అధ్యక్షుడు మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద మైలప్రోలు, బొడ్రాయి నాభి శిల ప్రాంగణం, రేణుకా ఆలయాల్లో అభిషేకం, అలంకరణ, హోమం, అఖండ హారతి, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు కొనసాగాయి. శనివారం బోనాలు, పుట్టమన్ను, గంగ తెప్ప, ఆదివారం పూజారి రాంచందర్ ఒగ్గు కళాకారుల బృందంతో రేణుకా కల్యాణం తదితరవి వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు జి.వినయ్‌కుమార్, వై.జస్వంత్‌కుమార్, ఎం.మహేష్‌బాబు, ఆర్.బాలకిషన్, డి.సంతోష్‌కుమార్, డి.లక్ష్మీనారాయణ, వి.నర్సింగ్‌రావు, సి.నర్సింగ్‌రావు, సి.బాబు, కె.శ్రీకాంత్, ఎం.దర్శన్, ఎం.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

యూ డైస్ ప్లస్‌పై అవగాహన



గోల్కొండ: యూ డైస్ ప్లస్ పాఠశాలకు గుండెకాయలాంటిదని గోల్కొండ తెలుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం గోల్కొండ రిసాల బజార్‌లోని ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాలలో గోల్కొండ మండలాలకు చెందిన పాఠశాలల వారికి యూ డైస్ ప్లస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యూ డైస్ ప్లస్ అంటే పాఠశాల జీవిత చరిత్ర అని అన్నారు. ఇందులో అడిగిన విషయాలన్నిటిని తూచా తప్పకుండా పొందుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ మండల డిప్యూటీ ఐవోఎస్ మహ్మద్ బషీర్, అఖిల్, తిరుపతి, విజయ్ తదితరులున్నారు.

జడ్జిపై దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి

యాకుత్‌పురా: రంగారెడ్డి జిల్లా కోర్టులో జడ్జిపై జరిగిన దాడిని తెలంగాణ న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వీ సుబ్బయ్య తీవ్రంగా ఖండించారు. సిటీ సివిల్ కోర్టులోని రాష్ట్ర న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ నెల 13న రంగారెడ్డి జిల్లా కోర్టులో కేసు విచారణ జరుపుతున్న జడ్జిపై నిందితుడు దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం నాయకులు సాయి కుమార్, నరసింహారెడ్డి, ఆశాలతా, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం



మణికొండ: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను మున్సిపల్ శాఖ అడ్మినిస్ట్రేషన్, డైరెక్టర్, కమిషనర్(సీడీఎంఏ) శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లామని, అవి పరిష్కారమయ్యే వరకు వారికి అండగా ఉంటామని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్ అన్నారు. శుక్రవారం వారు పుప్పాలగూడలో పనిచేస్తున్న కార్మికులతో సమావేశమై 2023 నుంచి జీతాలు పెరగని విషయం, వారికి కనీసం రూ.24 వేల జీతాన్ని ఇవ్వాలని, సంవత్సరానికి 15 సాధారణ సెలవులను ఇవ్వాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ కమిషనర్‌కు తెలిపామన్నారు. రాబోయే వేసవి కాలన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ కార్మికులకు తాగునీటిని అందించేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.విఠల్, ఎ.లక్ష్మన్‌రావు, దిలిప్‌కుమార్, బి.మల్లేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఐటీలో వర్క్‌షాప్ ప్రారంభం


వర్క్‌షాప్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)లో పోలార్‌ఎక్స్ 5ఎస్ స్కింటిలేషన్ మానిటరింగ్ రిసీవర్ ఫర్ అడ్వాన్స్ రీసెర్చ్ ఉపయోగంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను శుక్రవారం ప్రారంభించారు. కళాశాలకు చెందిన ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్(ఏఐ,డీఎస్) విభాగాల సంయుక్తాధ్వర్యంలో సైంటిఫిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (ఎస్ఎస్ఆర్) ప్రోగ్రాం కింద నిర్వహిస్తున్నారు. ఇందులో వివిధ ఉన్నత విద్యా సంస్థల నుంచి 40 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎల్ఆర్ఎల్, డీఆర్డీ సైంటిస్ట్ డాక్టర్ ఎం. చక్రవర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన జీఎన్ఎస్ఎస్, ఆధునిక సాంకేతికతల్లో సంయుక్త పరిశోధన ప్రాముఖ్యతను వివరించారు. గౌరవ అతిథిగా హాజరైన ఆర్సీఐ, డీఆర్డీఓ సైంటిస్ట్ ఎం.కన్నన్ మాట్లాడుతూ.. జీఎన్ఎస్ఎస్‌లో కీలక పరిశోధన అంశాలు, యాంటీ జ్యామింగ్ యాంటెనా రూపకల్పన, స్పూఫింగ్ టెక్నిక్స్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీబీఐటీ ఆర్‌ఈ డైరెక్టర్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి, సలహాదారుడు డాక్టర్ ఏడీ శర్మ, ఈసీఈ హెచ్ఓడీ డాక్టర్ కె. వసంత్, అధ్యాపకులు డాక్టర్ డీఎల్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాల్లో మెరుగైన వైద్యం

- ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్
- మూడు బస్తీ దవాఖానాలు ప్రారంభం


నెక్నాంపూర్‌లో బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జిల్లా వైద్యాధికారి

మణికొండ: బస్తీ దవాఖానాల్లో స్థానిక ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉంటుందని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్, పుప్పాలగూడ, నెమలినగర్‌లలో మూడు బస్తీ దవాఖానాలను జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావుతో కలిసి ప్రారంభించారు. వీటితో పాటు అలకాపూర్ టౌన్‌షిప్‌లో రూ.95లక్షలతో అభివృద్ధి చేసిన కాళోజీ పార్కు, రూ.95లక్షలతో నిర్మించిన పుప్పాలగూడ గ్రామ సీసీ రోడ్డు, రూ.27లక్షలతో అభివృద్ధి చేసిన కేపీఆర్ కాలనీ పార్కు, రూ.1.08 కోట్లతో అభివృద్ధి చేసిన హుడా కాలనీ అబ్దుల్ కలాం పార్కు, నెమలినగర్‌లో రూ.1.95కోట్లతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మున్సిపాలిటీలలో జనాభాకు అనుగుణంగా ప్రతి గ్రామంలో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశామన్నారు. వాటిల్లో అన్ని రకాల వైద్య, రక్త పరీక్షలు, మందులను అందిస్తారన్నారు. వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు.

అభివృద్ధి నిరంతర ప్రక్రియ...

మున్సిపాలటీల్లో నిధులు లభ్యతను బట్టి ప్రజలకు ఎదురవుతున్న ప్రధాన సమస్యల పరిష్కారంతో పాటు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అభివృద్ధి పనులను నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని ఎమ్మెల్యే అన్నారు. ఐదేళ్లల్లో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధే ధ్యేయంగా కృషి చేశామన్నారు. రాబోయే రోజుల్లోనూ అదే ఒరవడిని అధికారులు కొనసాగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కిరణ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు లక్ష్మీశ్రీ, బాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, డాక్టర్‌లు, మాజీ కౌన్సిలర్‌లు, ఆయా కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమతాకుంభ్ ఉత్సవాలు


పారాయణంలో పాల్గొన్న భక్తులు


దివ్యదేశ మూర్తులకు పూజలు నిర్వహిస్తున్న చినజీయర్‌స్వామి

శంషాబాద్ రూరల్: సమతాకుంభ్‌లో భాగంగా శుక్రవారం గద్యత్రయ పారాయణం నిర్వహించారు. మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న సమతాస్ఫూర్తి కేంద్రంలో తృతీయ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీ భగవద్రామానుజులు అనుగ్రహించిన తొమ్మిది శ్రీ సూక్తులు, గాద్యత్రయ విశేషాలను చినజీయర్‌స్వామి భక్తులకు వివరించారు. మధ్యాహ్నం రామానుజ విజ్ఞాన వేదిక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ..భగవద్రామానుజులు విప్లవాత్మక మార్పులు తేవడంతో పాటు కుల వ్యవస్థను వ్యతిరేకించారని తెలిపారు. మతం పూజా గదిలోనే ఉండాలి..కులం గడప దగ్గరే ఆగిపోయి.. అందరం భారతీయులం అని గుర్తించాలన్నారు. అనంతరం 18 దివ్యదేశ మూర్తులకు గరుడ సేవలు నిర్వహించారు.

మణికొండలో ఎగ్జిబిషన్‌కు ఆదరణ


అలంకరణ సామగ్రిని కొనుగోలు చేస్తున్న మహిళలు

మణికొండ: దేశ వ్యాప్తంగా చేతి వృత్తుల వారు తయారు చేసిన బట్టలు, గృహోపకరణ వస్తువుల ఎగ్జిబిషన్ మణికొండ పైప్‌లైన్ రోడ్డులోని సుందర్ గార్డన్ ఫంక్షన్ హాల్‌లో కొనసాగుతుండటంతో ప్రజలు ఆదరిస్తున్నారు. ఇందులో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ లెనిన్, కలంకారి, బెంగాల్ కాటన్ చీరలతో పాటు డ్రస్ మెటీరియల్, డిజైనర్ బ్లౌస్‌లు, ఖాదీ మెటిరియల్, వన్ గ్రాం గోల్డ్ జువెల్లరీ, జైపూర్ బెడ్‌షీట్, కొండపల్లి బొమ్మలు, పర్సులు, గృహోపకరణ వస్తువులను అమ్మకాలు జరుపుతున్నారు. అనేక రాష్ట్రాలలో చేతి వృత్తి కళాకారులు తయారు చేసిన వస్తువులన్నీ ఒకే చోట మంచి నాణ్యతతో లభిస్తుండటంతో కొనుగోలుదారులు ఆదరిస్తున్నారని నిర్వాహకుడు అక్బర్ తెలిపారు. కొన్ని రోజులు మాత్రమే ఎగ్జిబిషన్ ఉంటుందని మణికొండ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. 18వ డివిజన్‌లోని వీబీఎస్‌నగర్ కాలనీ, 19వ డివిజన్‌లోని మైఖేల్ కాలనీ, 8వ డివిజన్‌లోని బృందావన్ కాలనీల్లో డోర్ టూ డోర్ చెత్త సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి, హానికరమైన చెత్తను వేరు చేసి స్వేచ్ఛ ఆటోలకు అందించాలన్నారు. ప్రజలు ప్రతి రోజు ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు చెత్తను అందించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దు అన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవాన్లు యాదగిరి, శ్రీధర్, నవీన్, రాము తదితరులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి


రాజేంద్రనగర్ చౌరస్తాలో దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని రాజేంద్రనగర్ చౌరస్తాలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పచ్చ నర్సింగ్‌రావు, మాజీ అధ్యక్షుడు పంబల రాజు, మంత్రి చంద్రశేఖర్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు గొడుగు సంజీవ, తెలంగాణ రాష్ట్ర మాల మాదిగ ఉపకులాల ప్రధాన కార్యదర్శి కావాలి అనంతయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు క్యాసారం శంకర్‌రావుమాదిగ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక


మాజీ మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన జూకల్ వాసులు

శంషాబాద్ రూరల్: జూకల్ గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం మాజీ మంత్రి పి.సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు పి.జంగారెడ్డి ఆధ్వర్యంలో వీరు పార్టీ తీర్థం తీసుకున్నారు. రాష్ట్రంలో అధికార పార్టీ పాలనతో ప్రజలు విసిగిపోయారని, ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని సబితారెడ్డి అన్నారు. నాయకులు సి.రఘు, వాజిద్, అంజిగౌడ్, లక్ష్మారెడ్డి, శ్రీపతిరెడ్డి, రవి, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీఎస్ఐ శ్వేతపత్రంలో ట్రిపుల్‌ఐటీ స్మార్ట్‌సిటీ లివింగ్ ల్యాబ్ కీలకపాత్ర

రాయదుర్గం: స్మార్ట్ సిటీ సొల్యూషన్స్‌పై టెలికామ్ స్టాండర్డ్స్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆఫ్ ఇండియా (టీడీఎస్ఐ) విడుదల చేసిన శ్వేతపత్రంలో గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్ కీలకపాత్ర పోషించింది. ఈ శ్వేత పత్రంపై శుక్రవారం ట్రిపుల్‌ఐటీ స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్ చీఫ్ టెక్నాలజీ ఆర్కిటెక్ట్ అనురాధ వట్టెం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ శ్వేతపత్రం స్మార్ట్ సిటీలకు అందించిన సహకారంలో ముఖ్యమైన మైలురాయిగా సూచిస్తుందన్నారు. టీఎస్‌డీఎస్ఐ, విద్యావేత్తలు, పరిశ్రమల నుంచి అనేక మంది సహకారంతో ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు. ఈ శ్వేతపత్రంలో స్మార్ట్‌సిటీ నిర్దిష్ట పరిష్కారాలు, ప్రస్తుత లివింగ్‌ల్యాబ్‌లు ముందుకు వెళ్లడానికి సవాళ్లు, సూచనలు వంటి అంశాలు కీలకంగా మారాయన్నారు.

రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



రాయదుర్గం: సైబరాబాద్ పోలీసులు, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ సర్వీసెస్ (ఎస్‌సీఎస్‌సీ) ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని కేంద్రీయ విద్యాలయలో శుక్రవారం రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ అదనపు పోలీసు కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. రోడ్డు భద్రతపై అవగాహన, బాధ్యతాయుతంగా డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ఎస్‌సీఎస్‌సీ ప్రతినిధి నిషాకర్కి, కేశవ్‌బండారి ఆధ్వర్యంలోని బృందం ట్రాఫిక్ నియమాలు, పాదచారుల భద్రత, హెల్మెట్లు, సీటు బెల్ట్‌ల ప్రాముఖ్యత, తదితర అంశాలపై వివరించారు.

ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు


ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న శంకర్‌రాథోడ్ తదితరులు

అత్తాపూర్: అత్తాపూర్ శాఖ ఐడీబీఐ బ్యాంక్ సౌజన్యంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆర్‌వో ప్లాంట్ తాగునీటి సౌకర్యం నిమిత్తం అందజేశారు. అలాగే 11 కుర్చీలు, రెండు అల్మారాలు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి శంకర్ రాథోడ్, ఐడీబీఐ బ్యాంక్ మేనేజర్ శ్రీలత హాజరయ్యారు. శంకర్ రాథోడ్ మాట్లాడుతూ.. ఐడీబీఐ బ్యాంక్ అత్తాపూర్ శాఖ వారిని అభినందిస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా ప్రభుత్వ పాఠశాలలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది శారదా, వెంకటేష్, పీఆర్‌టీయూ రాజేంద్రనగర్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌సాగర్, ఉపాధ్యాయులు జ్యోతి, కమలమ్మ, అనిత, కృష్ణవేణి, సురేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: మరమ్మతుల కారణంగా కాటేదాన్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. దుర్గానగర్, లక్ష్మీగూడ, గంగోత్రి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 1:30 గంటల వరకు దుర్గానగర్, దుర్గాహిల్స్, టీఎన్‌జీవోఎస్ కాలనీ, అయ్యప్ప స్వామి ఆలయం, మైలార్‌దేవ్‌పల్లి కల్లు కాంపౌండ్, శాంతినగర్, గణేష్‌నగర్ స్వప్నథియేటర్, లక్ష్మీగూడ గ్రామం, హౌసింగ్ బోర్డు కాలనీ, ఆర్‌జీకే, బాంబే కాలనీ, బృందావన్ కాలనీ, గణేష్‌నగర్ (హౌసింగ్ బోర్డు), గంగోత్రి ఇండస్ట్రీయల్ ఏరియా లేన్, గణేష్‌నగర్, పయోనీర్ స్కూల్, బాబా టెంట్ హౌస్, షమా టెంట్ హౌస్ తదితర ప్రాంతాల్లో కోత ఉంటుందన్నారు.

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో..

మణికొండ: కొత్త సర్వీసులు రిలీజ్ చేస్తున్నందున శనివారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు ఫీడర్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి 10:30 గంటల వరకు బయ్యాత్‌కాలనీ, తిరుమలహిల్స్, ఖిద్మాకాలనీ, డాలర్స్‌హిల్స్ ప్రాంతాల్లో. ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు పుప్పాలగూడ గ్రామం, మారుతీనగర్, దుర్గానగర్, రవీంద్రకాలనీ, గోల్డన్ ఓరియన్, మానస అపార్ట్‌మెంట్, ఎల్ఐసీ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, సత్యమ్మ గార్డన్, మర్రిచెట్టు సర్కిల్ ప్రాంతాల్లో. ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు అలకాపూర్ రోడ్డు నెంబర్ 13 నుంచి 25 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన వివరించారు. అలాగే ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గోగ్రీన్ కాలనీ, తుల్జారాం దేవాలయం వెనక, అలకాపూర్ రోడ్డు నెంబర్ 23 నుంచి 30 వరకు, బీఆర్‌సీ, సాయిచంద్ర కాలనీ, వినాయకనగర్ ఫేజ్–1 ప్రాంతాల్లో. మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు కేపీఆర్ కాలనీ, మణికొండ గార్డన్స్, సుందర్‌గార్డన్, యూనియన్ బ్యాంక్ ఏరియా, పోచమ్మ కాలనీ, నేతాజీ కాలనీ, శ్రీరాంనగర్ కాలనీ, హనుమాన్‌నగర్, ప్లెజెంట్‌వ్యాలీ, శ్రీనివాసనగర్, హరివిల్లులలో విద్యుత్ ఉండదన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1:30 గంటల వరకు భాగ్యలక్ష్మి కాలనీ, హుడాకాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, తులిప్‌గార్డన్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల వరకు పంచవటి కాలనీలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ తెలిపారు.

నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల్లో..

కొత్త సర్వీసులు విడుదల చేస్తున్నందున శనివారం నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల్లో పలు విద్యుత్ ఫీడర్ల పరిధిలో సరఫరాను నిలిపి వేస్తున్నామని ఏఈ మణికంఠ తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్ కాలనీ, వెంకటేశ్వరకాలనీ, పాషకాలనీ, అలిజాపూర్, ఈవీవీ కాలనీ, ఫెయిర్ ఫీల్డ్ కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామ న్నారు. అలాగే ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు గౌలిదొడ్డి క్యూ సిటీ ప్రాంతంలో. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కోకా పేట లెజెండ్ చిమ్నీస్, పావని విల్లాస్, ఎకో విల్లాస్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ తెలిపారు.

కిస్మత్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

బండ్లగూడ: కిస్మత్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మల్లేష్‌రాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. రాచ్‌చర్చ్ ఫీడర్‌లోని శ్రీ సాయికాలనీ, గవర్నమెంట్ స్కూల్, రాఘవేంద్ర కాలనీ, ఫైన్ ఆర్ట్స్ కాలనీ, ఎన్ఆర్ఐ టౌన్‌షిప్, రాధారియల్టీ, వివేకానంద కాలనీ, యాదాద్రి కాలనీ, ఓంనగర్ కాలనీ, ఎస్ఎం ఎన్‌క్లేవ్ 1,2, సీఎల్ విల్లాస్, పూజా విల్లాస్, రాక్‌చర్చ్, కీర్తి విల్లాస్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. కిస్మత్‌పూర్ ఫీడర్ పరిధిలోని కిస్మత్‌పూర్ గ్రామం, రాఘవేంద్ర కాలనీ, శివసాయి కాలనీ, బాబమ్మ కాలనీ, మైత్రి కాలనీ, వినాయకనగర్, మారుతీ కాలనీ, ఎస్బీ బస్తీ, శ్రీ కృష్ణా కాలనీ, విల్లా గార్డెన్, ఆరాధ్య విల్లాస్, ఓఎన్ఎస్ విల్లాస్, గృహషిప్, గిరిధారి అపార్ట్‌మెంట్, హనుమాన్ ఆలయం తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే డిఫెన్స్ కాలనీ ఫీడర్ పరిధిలోని ఆర్.కె.నిర్మాన్, ట్రంప్‌విల్లా, సాయిబాబా కాలనీ, డిఫెన్స్ కాలనీ, రామ్‌కీ విల్లా, కూటర్ ఎస్ఆర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 12.30 వరకు సరఫరా ఉండదన్నారు. విద్యాపీఠం ఫీడర్ పరిధిలోని సరస్వతీ విద్యాపీఠం, భవానీకాలనీ, సిరి ఎన్‌క్లేవ్, శ్రీనివాసం ఎన్‌క్లేవ్, దాత్రి లేఅవుట్, ఆనందనగర్, కృష్ణానగర్, శివాజీ యూత్ బిల్డింగ్, బండ్లగూడ జాగీరు, పోచమ్మ ఆలయం, వికాస్‌నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12.30 నుంచి ఒంటిగంట వరకు అంతరాయం ఉంటుందన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9989616273
9010221230